గ్రామదేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



హమాల్‌బస్తీలో బొడ్రాయి పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్: గ్రామదేవతల చల్లని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని....ఆ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో విరాజిల్లాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీ మురికివాడలో ప్రతిష్ఠించిన బొడ్రాయి పండుగ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన వార్షిక పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బొడ్రాయికి పూజలు నిర్వహించి అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. ఆనాడు బస్తీ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని...బొడ్రాయి ఏర్పాటు వల్ల అంతా మంచి జరుగుతుందని పండితుల సూచన మేరకు గత సంవత్సరం హమాల్‌బస్తీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో బొడ్రాయిని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, లష్కర్ సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్, లక్ష్మీపతి, బస్తీ నాయకులు సుభాష్, రవి, రాజు, కుషాల్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ నిర్వహణ కోసం నిధులు సమీకరించుకోవాలి

సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి

బంజారాహిల్స్: గత పాలక మండలి ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కారణంగా ఆదాయ పన్ను శాఖలకు భారీ మొత్తంలో పన్ను చెల్లించాల్సి ఉంటుందని, ఈ విషయంపై గతంలోనే సంబంధిత శాఖలతో చర్చలు జరిగాయని సొసైటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని వెంకటేశ్వర కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ(ఎమ్మెల్యే కాలనీ) సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ఒక వేళ ఆదాయ పన్ను శాఖ నుంచి సొసైటీకి వ్యతిరేకంగా నిర్ణయం వస్తే సొసైటీ అకౌంట్స్‌లో ఉన్న రూ. 51 లక్షలు పన్నుగా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. సొసైటీ నిర్వహణ కోసం కాలనీవాసుల సమస్యల పరిష్కారం కోసం నిధుల సమీకరణ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సొసైటీ సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గతంలో ఏప్రిల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశానికి జరిగిన మినిట్స్ ఆఫ్ మీటింగ్‌ను నిర్ధారించారు. కాలనీలో మెయింటెనెన్స్ పనులను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. దీని కోసం కొంత రుసుము పెట్టాలని ప్రతిపాదనలను సమావేశం ముందుంచారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ రోజారాణి, సొసైటీ ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్ రెడ్డి, కోశాధికారి సరళ రాజ్యలక్ష్మి, రమేష్ రెడ్డి, లింగయ్య, విజయ్‌కుమార్, ప్రతిమ, రిధిమ, ఆజంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతి, కళలను భావితరాలకు అందించాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మామిడి హరికృష్ణ

శ్రీనగర్‌కాలనీ: మన కళలు ప్రాచీనమైనవని మన సంస్కృతి, కళలను భావితరాలకు అందించాలని తెలంగాణా బాషా, సాంస్కృతికశాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం అమీర్‌పేట కమ్మ సంఘంలో భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ అండ్ ఆర్ట్స్ తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాట్యమార్గంలో పేరిట 30రోజుల సైద్ధాంతిక కూచిపూడి నాట్య శిక్షణా శిబిరాన్ని మామిడి హరికృష్ణ ప్రారంభించారు. నేటి యువతకు మన కూచిపూడి నృత్య కళలోని విశేషాలను విపులంగా వివరిస్తూ ఈ శిక్షణా శిబిరం ఉంటుందని, ఔత్సాహికులు ఈ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ నాట్య గురువులు కోకా విజయలక్ష్మి, జి.రవి, మధుమతి కులకర్ణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ డాక్టర్ సంగనబట్ల నరసయ్య, డాక్టర్ కె.సూర్య, ఎం.మణిమాల పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



అవార్డును అందుకున్న వరాల గౌతమ్‌కుమార్

కాచిగూడ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమ్‌కుమార్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. కలాం 93వ జయంతి సందర్భంగా కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆదివారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఆయన మాట్లాడుతూ... డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో ఉన్న ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకోవడం జీవితంలో గర్వకారణమన్నారు. ఈ అవార్డుతో మరింత ఉత్సాహం అందించి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి మరింతగా కృషి చేసేందుకు ప్రేరణ ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా మిస్ సామిత, పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు, బంధుమిత్రులు, గౌతమ్‌కుమార్‌ను కలిసి అభినందించారు.

రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెట్టు సాయికుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రజక ఫిషర్ మెన్ రాష్ట్ర సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ ఫిషర్‌మెన్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల అవగాహన యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు మాట్లాడుతూ... నవంబర్ 25న కామారెడ్డి జిల్లా నుంచి రిజిస్ట్రేషన్ల అవగాహన యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రాజీవ్ చాకలి, ఉపాధ్యక్షులు రాజశేఖర్, కోశాధికారి నేరెళ్ల కుమార్, ప్రధాన కార్యదర్శి ఉప్పాల యాదయ్య, రాష్ట్ర నాయకులు రాగల రమేష్, రామస్వామి, మిట్టపల్లి శ్రీను, సైదులు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని, ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో 10 శాతం ఉద్యమకారులకు, ఉద్యమకళాకారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఉద్యమ కళాకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర సాధకులుగా గుర్తించి గౌరవించాలని ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. జ్యోతిరెడ్డి, బల్దేవ్‌రెడ్డి, కొంతం వీరస్వామి, పాకాల రాంచందర్, జానకిరెడ్డి, ఇంద్రకుమార్, అనిల్‌కుమార్, గగస్ కుమార్ వెంగళ భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ఎప్పుడో?

లాలాపేట రోడ్డు విస్తరణను పట్టించుకోని ప్రభుత్వం
రోజు రోజుకూ జటిలంగా మారుతున్న ట్రాఫిక్ సమస్య



లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ పనులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన అనంతరం రెండేళ్లకు అప్పటి ఎక్సైజ్ మంత్రి పద్మారావుగౌడ్ హయాంలో దాదాపు రూ. 100 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. లాలాపేట అంబేద్కర్ విగ్రహం నుంచి మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వరకు సుమారు 1.2 కిలోమీటర్ల మేర గల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణ ప్రారంభించినప్పటికీ 8 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రభుత్వాలు మారినా.. రోడ్డు విస్తరణ మాత్రం పూర్తి కాలేదు. ఓ వైపు జనాభా పెరుగుదల, మరోవైపు వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగి లాలాపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్ర తరంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపు..

రహదారికి ఇరువైపుల అక్కడక్కడ కొన్ని భవన సముదాయాలను విస్తరణలో భాగంగా కూల్చివేశారు. అర కొరగా.. రోడ్డు విస్తరణ చేపట్టి వదిలేయడంతో రోడ్డుకు బయట ఉన్న విద్యుత్ స్తంభాలు రహదారి మధ్యలోకి వచ్చాయి. లాలాపేట ప్రధాన రహదారిలో మంజీరీ నర్సింగ్‌హోమ్ నుంచి భగవతి పోచమ్మ దేవాలయం వరకు ప్రధాన రహదారి మలుపు తిరిగి ఉంది. వాహనదారులు వేగంగా వెళ్తూ.. సరైన అవగాహన లేక ప్రమాదాల భారిన పడుతున్నారు. పాదచారులు సైతం రోడ్డు దాటలేకపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తా లేని అధికారులు..

గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణపై అప్పుడప్పుడైనా కనిపించే అధికారులు రాష్ట్రంలో ప్రభుత్వం మారాకా లాలాపేట రోడ్డు విస్తరణపై ఇటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. రోడ్డు విస్తరణలో తొలగించాల్సిన 152 ప్రాపర్టీస్‌ను గుర్తించిన అధికారులు ఇప్పటి వరకు దాదాపు 80కి పైగా కూల్చివేసి తదానంతరం మరిచారు. ఇదే అదనుగా కొందరు రోడ్డు విస్తరణ చేసిన ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించుకుని యథేచ్ఛగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీరకపోగా.. మరింత ఎక్కువై ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది.



వేణుగోపాల్‌రావుకు సత్కారం



లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావును ఆదివారం కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిగా కృష్ణమూర్తి



లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్,ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శిగా బెజ్జాల కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన యూనియన్ ప్రథమ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇంత కాలం జిల్లా ఇంచార్జిగా ఉన్న కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ డ్రైవర్ల హక్కుల పరిరణకు తన వంతుగా ఉద్యమిస్తామన్నారు. జిల్లా కార్యదర్శిగా తనను ఎన్నుకున్న యూనియన్ కార్యవర్గం, సభ్యులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బస్సులో ల్యాప్‌టాప్ మాయం

వెంగళరావునగర్: బస్సులో ప్రయాణికుడి ల్యాప్‌టాప్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కడప ప్రాంతానికి చెందిన పి. ఉదయ్‌కుమార్ స్థానిక ఆల్వాల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. శనివారం రాత్రి కడప నుంచి నగరానికి బస్సు ఎక్కి ఉదయం అమీర్‌పేటలో బస్సు దిగాడు. అనంతరం తన బ్యాగ్ కోసం వెతకగా ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్ కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తలపై దాడి

వెంగళరావునగర్: భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్ ప్రాంతానికి చెందిన సంపూర్ణ, నాగరాజు దంపతులు ఈనెల 26వ తేదీ రాత్రి సంపూర్ణ సోదరి ఇంటి నుంచి తమ గృహానికి వెళ్ళడానికి న్యూటన్ హైస్కూల్ వద్ద ఉన్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి రోడ్డుపై ఎందుకు ఉన్నావని నాగరాజును ప్రశ్నించారు. దీంతో యువకులకు నాగరాజుకు వాగ్వాదం చోటుచేసు కోగా వారు నాగరాజుపై దాడికి పా ల్పడ్డారు. అడ్డువచ్చిన సంపూర్ణపై కూడా దాడి చేశారు. భార్యాభర్తలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న

బసవతారకంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న స్ఫూర్తితో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ముందుకు సాగుతుందని సినీనటుడు శేఖర్ భాష అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ వద్ద రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు శేఖర్ భాష హాజరై మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా గత పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎందరికో అండగా నిలుస్తున్న ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పెద్ది శంకర్‌గౌడ్‌కు అభినందనలు తెలియజేశారు. రోగులు, వారి వెంట వచ్చే సహాయకులకు ప్రతి ఆదివారం ఆహారాన్ని అందించడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్చన, డాక్టర్ సంతోష్, కో–ఆర్డినేటర్ ప్రకాష్, లక్ష్మణ్, చైతన్య, ప్రవీణ్, నితిన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమన్యాయం కోసం తపనపడిన వ్యక్తి లక్ష్మణ్‌రావు



నివాళులర్పిస్తున్న అర్పిస్తున్న జయప్రకాశ్ నారాయణ

లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ

ఖైరతాబాద్: ఏ హోదాలో ఉన్నా సామాజిక సేవ, సమాజహితం కోసం కృషి చేయడంతో పాటు సమన్యాయం కోసం తపనపడే గొప్ప వ్యక్తి అంబటి లక్ష్మణ్‌రావు అని వక్తలు కొనియాడారు. ఆదివారం జలవిహార్‌లో దివంగత మాజీ జస్టిస్ డాక్టర్ అంబటి లక్ష్మణ్‌రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, రిటైర్డ్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ హోదాలో ఉన్నా సమాజం కోసం కృషి చేశారని, అందరికి సమన్యాయం చేయాలని తపన పడేవారన్నారు. ఆయన నిజాయితీకి నిలువుటద్దమని, ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగినా మానవత్వ విలువలతో లోతుగా ఆలోచించే వ్యక్తి గుర్తు చేశారు. ఆయన పుట్టిన గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం, వెల్లలూరు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని, అప్పట్లోనే మద్యపాన నిషేధం చేపట్టారని ఇప్పటికి అలాగే కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడీ లక్ష్మినారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ భీం రెడ్డి, రిటైర్డ్ జెస్టిస్‌లు గ్రంధి భవానిప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.

సైబర్ మోసాలపై ఆకట్టుకున్న వీధినాటకం



బంజారాహిల్స్: హైదరాబాద్‌లో నవంబర్ 6న జరగనున్న సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్–2.0 సన్నాహక కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ జీవీకే మాల్ వద్ద నిర్వహించిన వీధి నాటకం ఆలోచింపజేసింది. సైబర్ సెక్యూరిటీ సమస్యలపై ఈ నాటకం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించి అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌లు విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రజల్లో చైతన్య తీసుకురావడం ద్వారా అరికట్టవచ్చన్న లక్ష్యంతో హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా ఫేక్ స్కీమ్స్, దొంగతనాలు, ఓటీపీ/యూపీఐ మోసాలు, తదితర డిజిటల్ ప్లాట్‌ఫాం అంశాలపై ప్రజలు ఏవిధంగా మోసపోతున్నారనే దానిపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, వెబ్‌సైట్ వివరాలను ప్రేక్షకులకు అందించారు. నవంబర్ 2న సాయంత్రం 6.30 గంటలకు ప్రసాద్ ఐమ్యాక్స్ వద్ద కూడా వీధినాటకం ప్రదర్శించనున్నట్లు హెచ్‌సీఎస్‌సీ ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రకుమారస్వామి అన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవడం హర్షించదగ్గ పరిణామమన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు స్వయంగా ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ తాము అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ప్రకటించి ఏడు నెలల క్రితమే నిర్ణయించి ఆచరణలో నవంబర్ 4 నుంచి చేపడతానని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఇంటింటికి తిరిగి కులగణన చేయడానికి ఏకంగా 80 వేలమంది ఎన్యుమరేటర్లకు నియమించడం గొప్ప విషయమన్నారు. ఒక్కొక్కరు 150 ఇళ్లల్లో కులగణన చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 4న ప్రారంభమై 19వ తేదీన ముగిస్తుందని అంటే కేవలం 15 రోజుల్లో కులగణన జరుగుతుందన్నారు. బలహీన వర్గాలు కులగణనకు సహకరించి పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడించాలని ఆయన విన్నవించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో) టమాటా.35, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 70, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 23, క్యారెట్ 53, దొండ 35, గుండు బీన్స్ 115, గింజ చిక్కుడు 105, గోకరకాయ 55, కీర 31, దోసకాయ 40, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 17, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీజేపీ సభ్యత్వ నమోదు



బౌద్ధనగర్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బౌద్ధనగర్ డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా హాజరైన బిజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిందని, రెక్కాడితే కాని డొక్కాడని పేద ప్రజలందరూ కాంగ్రెస్‌పై పెట్టుకున్న ఆశలన్నీ నీరుగారిపోయాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, రాచమల్ల కృష్ణమూర్తి, కందటి నాగేశ్వర్‌రెడ్డి, మేకల కీర్తి హర్షకిరణ్, హనుమంతు ముదిరాజ్, వెంకటేష్, మనోజ్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 7 నుంచి గ్రేస్ ఫెస్టివల్స్

లాలాపేట: తార్నాక ఐనోస్ చర్చి ఆధ్వర్యంలో నవంబర్ 7 నుంచి నాలుగు రోజుల పాటు గ్రేస్ ఫెస్టివల్స్–2024ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఐనోస్ మినిస్ట్రిస్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్ విలియం కేరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నాచారం హెచ్‌ఎంటీలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో నాలుగు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కృప పండుగుల జరుగుతాయన్నారు.

'వీసీల నియామకంలో కామర్స్ ప్రొఫెసర్లకు అన్యాయం'

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకంలో కామర్స్ ప్రొఫెసర్లకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ కామర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్.ఎం రామేశ్వర్ రావు ఆదివారం పేర్కొన్నారు. వర్సిటీలలో కామర్స్ కోర్సుకు అధిక ప్రాధ్యాన్యత ఉందని బీకాం, ఎంకామ్‌లో ఇతర కోర్సుల కంటే ఎక్కువగా విద్యార్థులు ప్రవేశం పొందుతారని తెలిపారు. కామర్స్ చదివిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు. అయినా ఇంత వరకు నియమించిన వీసీలలో ఒక్క కామర్స్ ప్రొఫెసర్ కూడా లేకపోవడం విచారకరమన్నారు. కామర్స్ అధ్యాపకులను వీసీలుగా నియమిస్తే వర్సిటీలు అభివృద్ధి చెందుతాయన్నారు.

అనారోగ్యంతో ఆటోడ్రైవర్ మృతి



మృతుడు కిరణ్‌కుమార్

బన్సీలాల్‌పేట్: అనారోగ్యం కారణంగా మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిసై ఓ వ్యక్తి మరణించాడు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం...బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కిరణ్‌కుమార్(34) ఆనారోగ్యం కారణంగా మరణించాడు. కిరణ్‌కుమార్‌కు గత సంవత్సరం ఎడమ కాలు ఇన్‌ఫెక్షన్ కారణంగా తొలగించారు. అప్పటి నుంచి తీవ్ర మానసిక వేదనకు గురైన కిరణ్ మద్యానికి బానిసయ్యాడు. జీరా ప్రాంతంలో మరణించిపడి ఉండగా స్థానికులు గాంధీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతుడు బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వెంటనే మృతుడి భార్యకు సమాచారం ఇచ్చారు. మృతుడు భార్య రజిత ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సాయినాథ స్తవన మంజరీ పారాయణం

నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం మహా మహిమాన్విత నిత్య పారాయణ వచన గ్రంథము 'శ్రీ సాయినాథ స్తవన మంజరీ' పారాయణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పారాయణ బృందం , భక్తులు సామూహికంగా పారాయణంలో పాల్గొన్నారు.

ఆర్టీఐ కమిషనర్లను నియమించాలి

కాచిగూడ: సమాచార హక్కు చట్టం కమిషనర్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నియమించాలని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్ కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం–2005 ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. ఆర్టీఐ కమిషనర్లను నియమించకపోతే వేలాదిమంది కార్యకర్తలతో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆర్టీఐ కమిషనర్లు లేక కార్యాలయాల్లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, సూర స్రవంతి, వెంకటేశం, గుండెల రాయుడు, వెంకటేష్, సినీహీరో కిరణ్, ఫిల్మ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీఆర్, చింతల రాఘవేందర్, గంగా ప్రియా రెడ్డి, ఎడ్ల అనిత, గొరవేని సుమన్, వినయ్‌కుమార్, భానుప్రసాద్, లక్ష్మణ్ తదితరులున్నారు.

మహిళకు బెదిరింపులు

వ్యక్తిపై కేసు నమోదు

వెంగళరావునగర్: తనను పెళ్ళి చేసుకోకపోతే కుమారుడిని, కోడలిని చంపుతానని మహిళను బెదిరించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... దేవులబాయి సినీ పరిశ్రమలో పని చేస్తుంది. ఆమెకు తనకు తెలిసిన స్నేహితుడు వక్కీ ద్వారా కాళిదాస్ పరిచయం అయ్యాడు. గత సెప్టెంబర్‌లో ఆమె ఆరురోజులు (మూడురోజులు యాక్టింగ్, మరో మూడురోజులు డబ్బింగ్) పని చేసింది. ఇందుకు సంబంధించి డబ్బులు అడగ్గా కాళిదాస్ నిరాకరించాడు. అంతేగాకుండా తనను పెళ్ళి చేసుకోవాలని లేదంటే ఆమె కుమారుడిని, కోడలును చంపుతానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.